పోగుల రాజేశంను వెంటనే విడుదల చేయాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: పౌర హక్కుల సంఘం వరంగల్ జిల్లా కోశాధికారి పోగుల రాజేశంను ఛత్తీస్‌ఘడ్ పోలీసులు ఎలాంటి సమచారం లేకుండా అక్రమంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని వెంటనే రాజేశంను బేషరతుగా విడుదల చేయాలని పౌరహక్కుల సంఘం నేత ప్రొఫెసర్ హరగోపాల్ డిమాండ్ చేశారు. రాజేశంపైన ఛత్తీస్‌ఘడ్ పబ్లిక్ సెక్యూరిటీ యాక్టు, ఉపా చట్టాన్ని ప్రయోగించడం సరైంది కాదన్నారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాజేశం కుటుంబ సభ్యులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. రవిచంద్ర, మాదన కుమారస్వామి, పోగుల రాజేశం కుమారుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఫిట్‌మెంట్ ప్రకటనపై ఆర్టీసీ ఉద్యోగుల హర్షం

చిక్కడపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ ఉద్యోగులకు 21 శాతం ఫిట్‌మెంట్ ప్రకటించడం పట్ల టీఎస్ ఆర్టీసీ కార్మిక సంఘ్ (బీఎంఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్ర స్వామికుమార్ హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం ఆర్టీసీ క్రాస్ రోడ్డులోని శ్రమశక్తి భవన్‌లో నిర్వహించిన బీఎంఎస్ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులతో సమానంగా 30 శాతం ఫిట్‌మెంట్ ప్రకటించాలని కోరారు. బకాయిలను జూన్ నెల వరకు చెల్లించాలన్నారు. రామ్మోహన్, మనోహర్‌రావు, కులకర్ణి, వెంకట్‌రెడ్డి, రమేష్‌కుమార్, మాణిక్యం పాల్గొన్నారు.

రాష్ట్రంలో బలమైన శక్తిగా బీజేపీ

కాచిగూడ: తెలంగాణలో బలమైన శక్తిగా బీజేపీ అవతరిస్తుందని ఆ పార్టీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు అన్నారు. ఆదివారం బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి సారంగుల అమర్‌నాథ్, కేశబోయిన శ్రీధర్‌లతో కలిసి ఆయన మాట్లాడారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా తెలంగాణ పర్యటన తర్వాత రాష్ట్రంలో పెను మార్పులు సంభవించబోతున్నాయన్నారు. ఈనెల 12న మంగళవారం ఎల్‌బీ స్టేడియంలో జరిగే 'పోలింగ్ బూత్ అధ్యక్షుల సమ్మేళనం'లో అమిత్‌షా ముఖ్యఅతిథిగా పాల్గొంటారన్నారు. కేంద్రంలో 400 సీట్లలో గెలుపే లక్ష్యంగా బీజేపీ పని చేస్తుందని, ఆ దిశగా పార్టీ కార్యకర్తలు, నాయకులను సమాయత్తం చేస్తున్నట్లు పేర్కొన్నారు.

టార్గెట్ కష్టమే!

- ఆస్తిపన్ను వడ్డీపై 90 శాతం రాయితీ
- ఈనెల 31 వరకే అవకాశం
- ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం

అంబర్‌పేట: ఆస్తిపన్ను చెల్లింపుదారులకు జీహెచ్ఎంసీ గొప్ప అవకాశం కల్పించింది. ఆస్తి పన్నుపై వేసిన వడ్డీపై 90 శాతం రాయితీ ఇస్తున్నారు. దీంతో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న ఆస్తిపన్ను చెల్లింపుదారులకు ఎంతో ఉపశమన కలుగుతుంది. ఈ అవకాశం ఈనెల 31 వరకు ఉంటుంది. ఆస్తి పన్నుపై కాకుండా కేవలం వడ్డీపై మాత్రమే ఈ రాయితీని కల్పించింది. దీంతో పేరుకుపోయిన ఆస్తిపన్ను బకాయిదారులు పన్ను చెల్లింపునకు ముందుకొస్తున్నారు.

లక్ష్యం చేరుకునేనా...

జీహెచ్ఎంసీ సర్కిల్–16 పరిధిలో సుమారు 72 వేలమంది ఆస్తిపన్ను చెల్లింపుదారులు ఉన్నారు. ఈ ఆర్థిక సంవత్సరానికి సర్కిల్–16కు రూ.53 కోట్ల పన్ను వసూలు లక్ష్యాన్ని జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం విధించింది. ఇప్పటికి సర్కిల్ అధికారులు రూ.38 కోట్లు మాత్రమే వసూలు చేశారు. ఇక మిగిలిన 20 రోజుల్లో రూ.15 కోట్లు వసూలు చేయడం అనుమానమే. కనీసం 90 లక్ష్యం చేరుకుంటారా.. అనేది వేచి చూడాల్సింది.

- గతంలో సర్కిల్ పరిధిలో 90 శాతం ఆస్తి పన్ను వసూలు జరిగేది. ఈ దఫా మాత్రం అందుకు తగ్గ వసూలులో సర్కిల్ అధికారులు విఫలమయ్యే అవకాశం లేకపోలేదు.

కారణాలు అనేకం...

జీహెచ్ఎంసీ అధికారులు ఎన్నికల విధులతో పాటు ప్రభుత్వం అమలు చేసే ప్రతి సంక్షేమ పథకం పర్యవేక్షించాల్సిన బాధ్యత వీరిపై ఉంది. రోజువారి పారిశుద్ధ్యం, రోడ్లు, వీధిలైట్లు, డ్వాక్రా సంఘాల పర్యవేక్షణ వంటి సేవలతో పాటు సంక్షేమ పథకాల సర్వేలు, ఇతర సేవలు అందించాల్సి ఉంటుంది. ఈ ఏడాది అసెంబ్లీ ఎన్నికల నిర్వహణ ఉండటం, దీనికి తోడు పార్లమెంటు ఎన్నికల కోసం సమావేశం, తదితర పనులను సైతం జీహెచ్ఎంసీ అధికారులు విధులు నిర్వహించాల్సి ఉంటుంది.

నిర్లక్ష్యంగా ఉన్నారనే ఆరోపణలు...

క్షేత్రస్థాయిలో ఆస్తిపన్ను వసూలు చేయాల్సిన సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సర్కిల్ పరిధిలో ప్రతి ఏడాది ఆస్తిపన్ను చెల్లింపుదారుల నుంచే వసూలు చేస్తున్నారే తప్పా.. కొత్త ఆస్తిపన్ను చెల్లింపుదారుల జోలికి వెళ్లడం లేదని పలువురు పేర్కొంటున్నారు. ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని పలువురు కోరుతున్నారు.



ఆస్తిపన్ను వసూలు చేస్తున్న డీఎంసీ మారుతి దివాకర్

పన్ను చెల్లించి అభివృద్ధికి సహకరించండి..

వడ్డీపై 90 శాతం ప్రభుత్వం రాయితీకి అవకాశం ఇచ్చింది. దీనిని చెల్లింపుదారులు సద్వినియోగం చేసుకుని ఆస్తిపన్ను చెల్లించి అభివృద్ధికి సహకరించాలి. ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తాం. ఆస్తిపన్ను వసూలులో సిబ్బంది నిర్లక్ష్యం చేస్తే తగిన చర్యలు తీసుకుంటాం.

– జీహెచ్ఎంసీ సర్కిల్–16 డీఎంసీ మారుతి దివాకర్

'మిలియన్ మార్చ్' స్ఫూర్తిని కొనసాగిస్తాం

ప్రొఫెసర్ కోదండరాం



మాట్లాడుతున్న ప్రొఫెసర్ కోదండరాం

కవాడిగూడ: తెలంగాణ రాష్ట్ర సాధనలో మిలియన్ మార్చ్ ప్రధాన భూమిక పోషించిందని, రాష్ట్ర ఆకాంక్ష నెరవేర్చడంలో ఈ ఉద్యమం ప్రజలకు నమ్మకం కలిగించిందని తెలంగాణ జనసమితి రాష్ట్ర వ్యవస్థాపకుడు, ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడటానికి ముఖ్యగట్టమైన మిలియన్ మార్చ్‌కార్యక్రమ స్ఫూర్తిని తీసుకొని తిరిగి నిర్వహించేందుకు గత ప్రభుత్వం కనీసం అనుమతి కూడా ఇవ్వలేదని ఆయన ధ్వజమెత్తారు. 14 ఏళ్ల తరువాత మొదటి సారి ట్యాంక్‌బండ్ మీదకు వచ్చేందుకు తమకు అవకాశం లభించిందని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ప్రజారంజకంగా పాలించడం వల్ల ఎలాంటి ఇబ్బందులు లేకుండా ట్యాంక్‌బండ్‌పైకి వచ్చామని, అనాటి స్ఫూర్తిని కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు. విద్యావంతుల వేదిక అధ్యక్షుడు అంబటి నాగయ్య నాడు ఉద్యమంలో పాల్గొన్న వారితో ప్రతిజ్ఞ చేయించారు. తెలంగాణ జనసమితి ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ పి.ఎల్ విశ్వేశ్వర్‌రావు, అంబటి శ్రీనివాస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బైరి రమేష్, నిజ్జన రమేష్, వినయ్, తెలంగాణ జనసమితి నగర అధ్యక్షుడు నర్సయ్య గౌడ్, యువత అధ్యక్షుడు సలీం పాషా, అరుణ్, రవికాంత్, సురేష్, రాంచందర్, లక్ష్మణ్, యశ్వంత్, రామగిరిప్రకాష్, వినయ్, విద్యాసాగర్, తుల్జారెడ్డి, పాషప్ప, మోహన్‌రెడ్డి, వినోద్‌కుమార్, రాజు, రవీందర్, జావిద్, రాజేష్, కొత్తరవి, రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బండి సంజయ్ వ్యాఖ్యలు అర్థరహితం

టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీసతీష్



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే హుస్సేన్‌సాగర్‌లో వేసినట్లే అని ఎంపీ బండి సంజయ్ చేసిన వాఖ్యలు అర్థరహితమని టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీష్ విమర్శించారు. ఆదివారం బాగ్‌లింగంపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గౌరీ సతీష్ మాట్లాడుతూ... బీజేపీ కేంద్రంలో అధికారంలోకి వస్తే సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని విదేశాల్లో ఉన్న నల్లధనాన్ని తీసుకువచ్చి పేదల అకౌంట్లలో రూ. 15 లక్షలు వేస్తామని మోసం చేసిన బీజేపీని వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో ఓడించాలని ఆయన పిలుపునిచ్చారు. బీజేపీ జాతీయ అధికార ప్రతినిధిగా, ఎంపీగా కొనసాగుతున్న బండి సంజయ్ తన స్థాయిని మరిచి కాంగ్రెస్ పార్టీపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. బీజేపీ పదేళ్ల పాలనలో జరిగిన అభివృద్ధిపై శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో మెజార్టీ ఎంపీ స్థానాలు గెలుచుకోనున్నామని తెలిపారు. కరీంనగర్‌లో బండి సంజయ్ ఓటమి ఖాయమని జోష్యం చెప్పారు.

ఆర్టీసీని ప్రభుత్వంలో వెంటనే విలీనం చేయాలి: జస్టిస్ చంద్రకుమార్



మాట్లాడుతున్న జస్టిస్ చంద్రకుమార్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ రాష్ట్రంలోని ఆర్టీసీని వెంటనే ప్రభుత్వంలో విలీనం చేయాలని హై కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ ఆర్టీసీ ఉద్యమకారుల ఆకాంక్షల వేదిక సదస్సు జరిగింది. ఈ సందర్భంగా జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ... ఉద్యమకాలంలో ఆర్టీసీ కార్మికులపై పెట్టిన కేసులు పెండింగ్‌లో ఉన్నాయని కార్మికులు కోర్టుల చుట్టు తిరగలేక ఇబ్బందులకు గురవుతున్నారని వారిపై పెట్టిన కేసులు వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. చిన్నచిన్న కారణాలతో 1576 మంది ఆర్టీసీ కార్మికులను తొలగించారని వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ ఉద్యమకారుల ఆకాంక్ష వేదిక కన్వీనర్ నగేష్‌పటేల్ మాట్లాడుతూ... ఆర్టీసీ కార్మికులకు పీఆర్‌సీని 30 శాతం ఇవ్వాలని, 2020–21లో ఉన్న పీఆర్‌సీ బకాయిలను వెంటనే చెల్లించాలని, 173 రోజుల డీఏ ఎరియర్స్‌ను వెంటనే చెల్లించాలని, చిన్న చిన్న కారణాలతో తొలగించిన డ్రైవర్లు, కండక్టర్లను వెంటనే విధుల్లోకి తీసుకోవాలన్నారు. ఆర్టీసీలో యూనియన్‌లను పునరుద్ధరించడంతో పాటు సంస్థల్లో ఉన్న ఖాళీలను వెంటనే భర్తీ చేయాలన్నారు. ప్రొఫెసర్ హరగోపాల్, ఉద్యమకారుల ఆకాంక్ష వేదిక చైర్మన్ కుమారస్వామి, సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి, విఠల్, అరుణోదయ సంస్కృతిక సమాఖ్య అధ్యక్షురాలు విమలక్క పాల్గొన్నారు.

కరాటే సాధనతో ఆత్మవిశ్వాసం

కాచిగూడ: కరాటే సాధన వల్ల క్రమశిక్షణతో పాటు ఆత్మవిశ్వాసం పెరుగుతుందని జపాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఇన్‌స్ట్రక్టర్ రాపోలు సుదర్శన్ అన్నారు. కాచిగూడ లింగంపల్లిలోని కర్ణాటక సాహిత్య మందిర్‌లో ఆదివారం జరిగిన కరాటే బెల్ట్ గ్రేడింగ్ ఎగ్జామ్‌లో ఉత్తీర్ణులైన బాలబాలికలకు ఆయన పాల్గొని కరాటే బెల్ట్ గ్రేడ్ సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. వివేక్, శివప్రసాద్, అభిరాజ్, కుషి ఎల్లో బెల్ట్, యస్వీ మందవియా గ్రీన్ బెల్ట్, కార్తిక్, సుజన్, శ్రావణి, సుమన్, రచననాయక్, వరప్రసాద్, వన్షిక, హన్షిక, దర్శిల్ కులకర్ణి, ఆయుషీ మందవియా బ్లూ గ్రేడ్ బెల్ట్‌లను అందుకున్నారు. కర్ణాటక సాహిత్య మందిర్ అధ్యక్షుడు విఠల్ జోషి, కార్యదర్శి నర్సింహ్మమూర్తి, కరాటే మాస్టర్ దామోదర్‌నాయక్, కరాటే ఇన్‌స్ట్రక్టర్ క్రిష్ణ, రాఘవేంద్ర దేసాయి తదితరులు పాల్గొన్నారు.

సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీతకు సన్మానం

నల్లకుంట: ఇటీవల ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా సంగీత నాటక అకాడమీ అవార్డు అందుకున్న ప్రముఖ కూచిపూడి నర్తకి మద్దాలి ఉషా గాయత్రికి అభినందనలు వెల్లువెత్తున్నాయి. శ్రీ సరస్వతి సంగీత విద్యాలయం ప్రిన్సిపాల్, పంచశత వీణా గానరత్న పోపూరి శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో పలువురు కళాకారులు ఆదివారం నల్లకుంట శివం సిండికేట్ బ్యాంక్ సమీపంలోని అవార్డు గ్రహీత ఉషాగాయత్రి నివాసానికి వెళ్లి ఆమెను శాలువాతో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా పోపూరి శ్రీనివాసశర్మ మాట్లాడుతూ.. గత కొన్ని దశాబ్దాలుగా కూచిపూడి నాట్య ప్రదర్శనలు ఇస్తూ.. అలనాటి వెండితెర నటులు అక్కినేని నాగేశ్వర్‌రావు, కృష్ణకుమారి లాంటి ప్రముఖుల నుంచి ప్రశంసలు అందుకోవడం గొప్ప విషయమన్నారు. ఓవైపు నాట్య ప్రదర్శనలు ఇస్తూనే.. మరోవైపు పలువురికి నాట్యంలో శిక్షణను ఇస్తున్న ఉషాగాయత్రికి కూచిపూడి నాట్యంపై ఉన్న ఆసక్తికి నిదర్శనమన్నారు. ఎంతో ఉన్నత స్థాయికి చేరుకున్న ఆమె బ్రెయిన్ స్ట్రోక్‌తో వీల్ చైర్‌కే పరమితమైనప్పటికీ ఆత్మ స్థైర్యం కోల్పోకుండా పలువురికి నాట్యంలో శిక్షణ ఇవ్వడం అభినందనీయమని కొనియాడారు. ప్రముఖ కూచిపూడి నర్తకి వాసవి, సంగీత అధ్యాపకులు తేజస్విని, యశస్విని పాల్గొన్నారు.

నాట్య చతుర అవార్డు ప్రదానం



నందితను సత్కరిస్తున్న దృశ్యం

చిక్కడపల్లి: వైఎస్సార్ మూర్తి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన మహిళ దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని ముఖ్యఅతిథిగా విచ్చేసిన ట్రస్ట్ చైర్మన్ వైఎస్సార్ మూర్తి, ప్రముఖులు నృత్య గురువులు లక్ష్మీశారద, ఝాన్సీరామ్‌లు పాల్గొని నాట్య కిన్నెర కుమారి నందిత రాజనాలకు నాట్యచతుర బిరుదుతో ఆదివారం బషీర్‌బాగ్‌లోని దక్కన్ టవర్స్‌లో ఆమెను సత్కరించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ మూర్తి, నృత్యగురువులు లక్ష్మీశారద, ఝాన్సీరామ్‌లు మాట్లాడుతూ నందిత రాజనాల చిన్ననాటినుండే నృత్యవిద్య నేర్చుకుని ఇప్పటికే పలు ప్రముఖ వేదికలపై అవార్డులు రివార్డులు అందుకోవడం జరిగందన్నారు. 2017లో ప్రభుత్వం వారు ఇచ్చే సిసిఆర్‌టి స్కాలర్‌షిప్ కి ఎంపిక కావటం ఎంతో అభినందనీయమన్నారు. ఇటీవల దూరదర్శన్ గ్రేడ్ ఆర్టిస్ట్‌గా కూడా ఎంపిక కావటం మరింత ఆమె ప్రతిభకు తర్కాణం అన్నారు. నందిత భవితరాలవారికి నాట్య విద్య ఆదర్శంగా మరిన్ని అవార్డులు గెలుపొంది జాతీయ స్థాయిలో ఉత్తమ కళాకారిణిగా రాణించాలని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

ఉచిత వైద్య శిబిరం



రోగులకు వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్లు

కాచిగూడ: ఉచిత వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని మెడికోవర్ ఆస్పత్రి వైద్యులు డాక్టర్ రాకేష్‌రెడ్డి, గైనకాలజిస్ట్ డాక్టర్ శృతి సూచించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మెడికోవర్ ఆస్పత్రి బేగంపేట బ్రాంచి సహకారంతో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు వీలుగా వైద్య శిబిరాలను నిర్వహిస్తూ.. ఉచిత వైద్య సేవలను అందిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ వైద్య సేవలను చుట్టు పక్కల బస్తీల ప్రజలు సద్వినియోగం చేసుకుని లబ్ధి పొందాలని కోరారు. సకాలంలో వైద్యసేవలు పొందడం ద్వారా అనారోగ్యం నుంచి విముక్తి పొంది ఆరోగ్యంగా జీవించవచ్చని సూచించారు. పేదల కోసం పలు బస్తీలు, మురికివాడలు, కాలనీల్లో ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నామన్నారు. మెడికోవర్ ఆస్పత్రి బేగంపేట బ్రాంచి హెడ్ రాజ్‌కుమార్, మేనేజర్ వినోద్‌కుమార్, సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

కాచిగూడ: చెప్పల్‌బజార్‌లో నిలిచిపోయిన సివరేజ్ పైపులైన్ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్ జలమండలి అధికారులు, కాంట్రాక్టర్‌కు సూచించారు. రోడ్డు తవ్వి సివరేజ్ పైపులైన్ పనులు ప్రారంభించి నెలలు గడుస్తున్నా.. పూర్తి చేయకుండా కాంట్రాక్టర్, అధికారులు పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. దీంతో స్థానిక ప్రజలు, వాహనదారులు నిత్యం అనేక ఇబ్బందులకు గురవుతున్నారని ఆమె పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం తగదన్నారు. అభివృద్ధి పనులను నాణ్యతతో చేపట్టాలని, నాణ్యత లోపిస్తే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ప్రజలు తిరగబడకముందే ప్రారంభించిన పనులను పూర్తి చేయాలని కోరారు. బీజేపీ నేతలు కన్నె రమేష్‌యాదవ్, భీమ్‌రాజ్, ఎస్.రవియాదవ్ తదితరులున్నారు.



అభివృద్ధి పనులను పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్ కన్నె ఉమ

'డబుల్ బెడ్‌రూమ్' లబ్ధిదారులను ఆదుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు పొందిన లబ్ధిదారులకు ఈరోజు వరకు ఇళ్లు అందించలేదని ఎమ్మెల్సీ నర్సిరెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇళ్లకు కరెంటు, మంచినీరు, లిఫ్ట్ తదితర సౌకర్యాలు కల్పించి లబ్ధిదారులకు అందించాలన్నారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో డబుల్ బెడ్‌రూమ్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, హైదరాబాద్ సిటిజన్ ఫోరం సంయుక్త ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నర్సిరెడ్డి మాట్లాడుతూ.. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు కనీస సౌకర్యాలు కల్పించకుండా గత ప్రభుత్వం ఎన్నికల ముందు లాటరీ తీసి లబ్ధిదారులకు సర్టిఫికెట్లు ఇచ్చిందని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం లబ్ధిదారులకు ప్రయోజనం చేకూర్చేలా తక్షణమే చర్యలు తీసుకోవాలని నర్సిరెడ్డి కోరారు. కార్యక్రమంలో ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు విజయ్‌కుమార్, సిటిజన్స్ ఫోరం అధ్యక్షుడు ఎం.శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో మద్దతు ఇవ్వండి ప్లీజ్

ఎడ్ల హరిబాబుయాదవ్‌ను కలిసిన బొంతు రామ్మోహన్

ముషీరాబాద్: సికింద్రాబాద్ లోక్‌సభ స్థానం నుంచి కాంగ్రెస్ పార్టీ టికెట్ ఆశిస్తున్న బొంతు రామ్మోహన్ ముషీరాబాద్ నియోజకవర్గంకు చెందిన బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి ఎడ్ల హరిబాబుయాదవ్ జన్మదినం నేపథ్యంలో భాగంగా హరిబాబు, ఆయన సతీమణి ముషీరాబాద్ డివిజన్ మాజీ కార్పొరేటర్ ఎడ్ల భాగ్యలక్ష్మిలను ఆదివారం పద్మారావునగర్‌లోని వారి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు ప్రస్తుత, భవిష్యత్ రాజకీయాలపై చర్చించుకున్నారు. సికింద్రాబాద్ నుంచి తనకు టికెట్ వచ్చే అవకాశం ఉందని మీ సహకారం తనకు అందించాలని హరిబాబుయాదవ్ దంపతులను రామ్మోహన్ కోరారు. రాజకీయ భవిష్యత్తు దృష్టిలో కాంగ్రెస్ పార్టీలో చేరాలని కూడా హరిబాబు యాదవ్‌ను బొంతు కోరారు. ఈ విషయంపై ఆలోచించి నిర్ణయం తీసుకుంటానని హరిబాబుయాదవ్ బొంతుకు స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా హరిబాబుయాదవ్‌కు జన్మదినోత్సవం చెప్పడానికి వచ్చిన డివిజన్ బీఆర్ఎస్ నాయకులతో కూడా రామ్మోహన్ కలిసి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎస్.మల్లికార్జున్‌రెడ్డి, గిరి తదితరులు పాల్గొన్నారు.

మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

కాచిగూడ: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జీవీఆర్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం కాచిగూడలోని అకాడమీలో మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో విశిష్ట సేవలందిస్తున్న మహిళలను అకాడమీ అసిస్టెంట్ డైరెక్టర్ అమృతారెడ్డి ఘనంగా సత్కరించి అభినందించారు. హిమాయత్‌నగర్ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్‌గౌడ్, మహిళా సెంట్రల్ జైల్ హైదరాబాద్ జైలర్ ఎం.జ్యోతి, కాచిగూడ సబ్ ఇన్‌స్పెక్టర్ మేఘన, హైకోర్టు అడ్వకేట్ స్నేహ బోగ్లో, డెంటిస్ట్ డాక్టర్ తారా రావర్తి తదితరులను ఈ సందర్భంగా సన్మానించారు. అనంతరం సన్మాన గ్రహీతలు మాట్లాడుతూ.. మహిళలు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. జీవీఆర్ కరాటే అకాడమీ డైరెక్టర్ జీఎస్ గోపాల్‌రెడ్డి, కరాటే విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులతో మహిళా దినోత్సవం



అంబర్‌పేట: సమాజంలో మహిళా శక్తిని మరింత బలోపేతం చేసేందుకు కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుందని ఆ పార్టీ ఖైరతాబాద్ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు శంభుల ఉషాశ్రీకాంత్‌గౌడ్ అన్నారు. అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా ఆదివారం బాగ్‌అంబర్‌పేట రామకృష్ణనగర్ పార్క్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నారీ న్యాయ్ సమ్మేళన్– సమరోహన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య కార్మికుల మధ్య కేక్‌కట్ చేసి మహిళ దినోత్సవం నిర్వహించారు. మహిళలు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. దేవయాని, షైనాజ్ బేగం, ప్రసన్న, సంగీత, పద్మ తదితరులు పాల్గొన్నారు.

కులరహిత సమాజం కోసం ఉద్యమించాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కుల రహిత సమాజ నిర్మాణం కోసం ఉద్యమించాలని కుల నిర్మూలన పోరాట సమితి (కేఎన్‌పీఎస్) రాష్ట్ర కార్యదర్శి బూరం అభినవ్ పిలుపునిచ్చారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కేఎన్‌పీఎస్ ఆధ్వర్యంలో సామాజిక ఉద్యమ ధ్రువతార సావిత్రీబాయి పూలే వర్ధంతి సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సావిత్రీబాయి పూలే వర్ధంతిని దళిత పీడిత కులాల మహిళా పోరాట దినంగా పాటించాలని సూచించారు. కేఎన్‌పీఎస్ అధ్యక్షులు జయరాజు, ప్రొఫెసర్ సూరేపల్లి సుజాత, రచయిత మెర్సీమార్గరేట్, అలివేలు, ఎం.సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

'బీజేపీని ఓడించడమే లక్ష్యం కావాలి'

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: దేశంలో మతోన్మాద బీజేపీని ఓడించడమే లక్ష్యంగా అన్ని శక్తులు ఏకమై పని చేయాలని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ (ప్రజాపంథా) రాష్ట్ర నాయకుడు కె.జి.రామచందర్ అన్నారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర ప్రజాస్వామిక వేదిక టీఎస్‌డీఎఫ్ రాష్ట్ర సదస్సు జరిగింది. ఈ సందర్భంగా రామచందర్ మాట్లాడుతూ... బీజేపీ ప్రభుత్వం తాము ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంతో పాటు ప్రజలను దారిమళ్లించే కుట్రలు చేసిందన్నారు. అందులో భాగమే రాజ్యంలోకి మతాన్ని జోడించారని విమర్శించారు. ప్రొఫెసర్ వినాయక్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జస్టిస్ చంద్రకుమార్, న్యూ డెమాక్రసీ నాయకులు జె.వి.చలపతిరావు, కె.గోవర్ధన్, సీపీఐ నేత బాలమల్లేష్, ఎంసీపీఐ నాయకులు గాదగోని రవి, మురహరి, కృష్ణప్రసాద్, ప్రసాదన్న తదితరులు పాల్గొని ప్రసంగించారు.

మాదిగలకు మూడు ఎంపీ సీట్లు ఇవ్వాలి

ముషీరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో ఎస్సీ సామాజికవర్గంలో అత్యధిక జనాభా ఉన్న మాదిగలకు మూడు ఎంపీ సీట్లు ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్‌మాదిగ డిమాండ్ చేశారు. ఆదివారం రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... తెలంగాణలో అత్యధిక జనాభా కలిగిన మాదిగలకు రెండు రిజర్వుడ్, ఒక జనరల్ స్థానాన్ని కేటాయించాలని డిమాండ్ చేశారు. గతంలో మల్కాజిగిరి స్థానాన్ని సర్వే సత్యనారాయణ, కేటాయించిన మాదిరిగానే రాష్ట్రంలో ఏదైనా ఒక జనరల్ స్థానాన్ని, రెండు రిజర్వుడ్ స్థానాలను మాదిగలకు కేటాయించాలన్నారు. ఎమ్మార్పీఎస్ కోర్ కమిటీ సభ్యులు బంగారి శ్రీనన్న, ఎన్.వేణుగోపాల్, చాప కృష్ణ, యాదగిరి, యువసేన రాష్ట్ర అధ్యక్షుడు పొట్టపెంజారా రమేష్, నాయకులు జి.సాయిలు, బాబురావు, బి.మహేష్, ఎస్.అశోక్, రాజు, ఎల్లయ్య, దయాకర్, బలరాం పాల్గొన్నారు.